# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న షిండే

- అందరినీ గెలిపించుకునే బాధ్యత తీసుకుంటా
- నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు సేవ చేస్తా
- అధైర్య పడవద్దు, ఎల్లవేళ లా అందుబాటులో ఉంటా
- బీఆర్‌ఎస్ కార్యకర్తలకు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే భరోసా

మద్నూర్, డిసెంబర్ 10: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని, ప్రతి గ్రామానికి వచ్చి తాను ప్రచారం చేస్తానని, అందరినీ గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సేవ చేస్తానని స్పష్టం చేశారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన మద్నూర్, డోంగ్లి, జుక్కల్ మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.15 ఏండ్లుగా తాను చేసిన అభివృద్ధి పనులు తెలియజేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యకర్తలందరూ ఇకనుంచి కలిసికట్టుగా పనిచేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో తమ సర్పంచ్, ఎంపీటీసీ గెలిచేలా ఇప్పటినుంచి ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, వాటిని గౌరవించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, లేనిపక్షంలో వారిని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. హామీలన్నీ అమలు చేసేవరకు వారిని నిద్రపోనివ్వబోమని, తాము నిద్రపోమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనను ఇతర రాష్ట్రాల వారు మెచ్చుకున్నారని, ఇక్కడి ప్రాంత ప్రజలకు మాత్రం అర్థం కాలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మద్నూర్, జుక్కల్, డోంగ్లి మండలాల అధ్యక్షులు బన్సీపటేల్, మాధవ్‌రావు దేశాయి, శశాంక్‌పటేల్, డీసీసీబీ డైరెక్టర్ రాంపటేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దరాస్ సురేశ్, గఫార్, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, విండో మాజీ చైర్మన్లు విజయ్‌కుమార్, పండిత్‌రావుపటేల్, నాయకులు సాయాగౌడ్, నీలూ పటేల్, శివాజీ, గంగారాం, విఠల్, రాజు, నాగేశ్, రవి, సుధీర్, జ్ఞాను, లక్ష్మణ్, బలిరాం, దేవిదాస్, గోపి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోచారానికి శుభాకాంక్షలు



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పోచారం శ్రీనివాసరెడ్డిని వర్ని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని పోచారం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్ని జడ్పీటీసీ బర్దావల్ హరిదాస్, వర్ని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు, మండల కో -ఆప్షన్ మెంబర్ కరీం, బీఆర్‌ఎస్ నాయకులు కల్లాలి గిరి, రంజ్యానాయక్, శ్రీనగర్ సర్పంచ్ రాజు తదితరులు ఉన్నారు.

-వర్ని, డిసెంబర్ 10

# షబ్బీర్ ఇంట్లో ఏండ్లుగా ప్రభుత్వ ఉద్యోగులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

- బయటి కన్నా.. ఇంట్లో ఉన్న కలుపు మొక్కలపై దృష్టి సారించాలి
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా
- సీఎం రేవంత్ ఇకనైనా ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి..
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి,డిసెంబర్ 10 : సీఎం రేవంత్‌రెడ్డి బయటి కలుపుమొక్కల కన్నా ఇంట్లో ఉన్న కలుపు మొక్కలపై ముందు దృష్టి సారించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజులుగా రాష్ట్రంలో విద్యుత్ శాఖలో జరిగిన రూ.80 వేల కోట్ల అవినీతి గురించి చర్చ జరుగుతుందని అన్నారు. ఈ స్కాం ఈ నాలుగేండ్లలో జరిగింది కాదని అన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే జరిగిందని.. ఇందులో రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఉండవచ్చని ఆరోపించారు. ఈ స్కాం విద్యుత్ శాఖ సీఎండీ ప్రభాకర్ రావు, అధికారులు చేసినది కాదని అన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఇంట్లో నాయక్ అనే విద్యుత్ శాఖ ఉద్యోగి 18 సంవత్సరాలుగా పని చేస్తున్నాడని అతని జీతం నెలకు రూ. లక్షన్నర వరకు ఉంటుందని, షబాజ్ అనే మైనార్టీ శాఖ ఉద్యోగి 15 సంవత్సరాలుగా షబ్బీర్ అలీ ఇంట్లో పని చేస్తున్నారని అతని జీతం కూడా రూ. లక్ష వరకు ఉంటుందని అన్నారు. 7 సార్లు ఎమ్మెల్యేగా ఓడిన షబ్బీర్ ఇంట్లో ఏ హోదాతో వీరు పని చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ లెక్కన వీళ్ల జీతాల ద్వారా ఇప్పటికే రూ. 2 కోట్లకు పైగా ప్రజాధనం వృథా చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి, మాణిక్ ఠాకూర్.. షబ్బీర్ అలీ ఇంటికి వెళ్లినప్పుడు ఈ ఉద్యోగులు కనబడలేదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఇకనైనా ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అన్నారు. ఏడు సార్లు ఓడిపోయిన వ్యక్తి మంత్రి పదవి కోసం సీఎం చుట్టూ తిరుగుతున్నాడని అన్నారు. సీఎం సమయమిస్తే స్వయంగా కలిసి వివరాలు అందిస్తానని తెలిపారు. సీఎం హోదాలో మాజీ సీఎం కేసీఆర్‌ను దవాఖానలో కలవడం హర్షణీయమని అన్నారు. తాను కూడా త్వరలో కేసీఆర్‌ను పరామర్శిస్తానని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మోత్కురి శ్రీకాంత్, బీజేపీ నాయకులు తేలు శ్రీను, భరత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు

బోధన్‌లో అందజేసిన మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా



బోధన్‌లో యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా

బోధన్, డిసెంబర్ 10: బోధన్ నియోజకవర్గంలోని యువకులకు మాజీ ఎమ్మెల్యే షకీల్ సొంత ఖర్చుతో 3,500 డ్రైవింగ్ లైసెన్స్‌లను ఉచితంగా అందజేస్తున్నట్లు షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా తెలిపారు. బోధన్ పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆమె ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంతమంది యువతీయువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేశారు. నిరుద్యోగ యువకులు, కొంతమంది విద్యార్థులు లైసెన్స్‌లు లేకుండా వాహనాలను నడుపుతున్నారని, లైసెన్సులు పొందడానికి వారికి ఆర్థిక స్థోమత లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. దీనిని గమనించిన మాజీ ఎమ్మెల్యే షకీల్ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేందుకు ప్రత్యేకంగా 20 రోజులపాటు శిబిరం నిర్వహించారని తెలిపారు. ఈ శిబిరంలో ఎంతో మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర్హులైనవారందరికీ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను ప్రస్తుతం అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ రావడంతో డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించడంలో కొంత ఆలస్యం జరిగిందని, ఎన్నికలు ముగియడంతో తాము ఇచ్చిన మాట ప్రకారం ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో మహిళలకు ఫ్రీ బస్సును ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



పిట్లంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



దోమకొండలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్లను ప్రదర్శిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

# 'మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ' ప్రారంభం

## హాజరైన స్థానిక ఎమ్మెల్యేలు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచే మరో పథకాన్ని ఉమ్మడి జిల్లాలో స్థానిక ఎమ్మెల్యేలు ఆదివారం ప్రారంభించారు. పిట్లంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, దోమకొండలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, డిచ్‌పల్లిలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి ప్రారంభించారు. ఈ పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

– పిట్లం/దోమకొండ/డిచ్‌పల్లి, డిసెంబర్ 10